కథ

# మనసున మనసై

మధ్యాహ్నా సమయం. సుమతి పని ముగించుకుని అప్పుడే మనవడి పక్కన నడుము వాల్చబోతోంది. అప్పుడే గేటు శబ్దం అయ్యింది. పడుకునే ప్రయత్నం విరమించుకుని లేచివెళ్ళి తలుపుతీసింది. గేటువేసి లోపలికి వస్తున్న ఆడపడుచును చూడగానే ఆమె ముఖం వికసించింది.

''ఎన్నాళ్ళకు వచ్చావు ఇందిరా'' అంటూ సంతోషంగా ఆహ్వానించింది.

''బాగున్నావా వదినా? ఆరోగ్యం బాగుందా?'' అంటూ ప్రశ్నలు వేస్తూనే లోపలికి వచ్చింది ఇందిర.

''అంతా బాగున్నాం'' అంటూ చల్లని మంచినీళ్లు ఇందిరకి అందించింది సుమతి.

''అబ్బ! చల్లటి నీళ్ళు తాగంగానే ప్రాణం లేచివచ్చినట్లయింది'' అంది ఇందిర నవ్వుతూ.

''మీవారు, బాబు బాగున్నారా?'' అనడిగింది సుమతి ఇందిర ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ. నవ్వుతున్న సుమతి ముఖం ఎప్పటిలా అనిపించలేదు ఇందిరకి.

''ఏంటి వదినా బాగా డల్‌గా కనిపిస్తున్నావు? ఆరోగ్యం బాగుంటోందా?'' అనడిగింది ఇందిర ఆప్యాయంగా.

ఆ ఆప్యాయతకి సుమతి కళ్లు చెమర్చాయి. అది ఇందిర దృష్టిని దాటిపోలేదు.

''ఏంటి చెప్పవు?'' రెట్టించింది.

''ఏంలేదులే ఇందిరా. బాబును ఏ కాలేజ్‌లో చేర్చావు'' అంటూ మాట మార్చబోయింది.

సుమతి చెయ్యిపట్టుకుని చూసింది ఇందిర. ఒళ్ళు కాలిపోతోంది. ''ఏంటింత జ్వరంగా ఉంటే ఏంలేదంటావు? టాబ్లెట్ వేస్కున్నావా'' అడిగింది. ''ఏంలేదులేమ్మా ఎండకి అట్లా అనిపిస్తోందంతే. సాయంత్రం మీ అన్నయ్య వచ్చాక అవసరమైతే టాబ్లెట్స్ తెప్పించుకుంటాలే'' అంది సుమతి.

''ఏంటొదినా ఇది? ఇంత జ్వరంగా ఉంటే ఎండ వేడి అంటావేంటి? ముఖమంతా పీక్కుపోయింది. ఉండు నేనిప్పుడే టాబ్లెట్స్ తెస్తాను'' అంటూ వేగంగా బైటికి వెళ్ళిపోయింది ఇందిర.

ఇంక ఓపిక లేనట్టు కుర్చీలో వెనక్కివాలిపోయింది సుమతి. పావుగంట తర్వాత ఇందిర మాత్రలు తెచ్చి సుమతి చేత బలవంతంగా మింగించింది.

''కాఫీ కలుపుకొస్తానుండు. నువ్వు పడుకో'' అని కాఫీ కలుపుకొచ్చి సుమతికొక కప్పు ఇచ్చి తనొక కప్పు తీసుకుంది ఇందిర.

''ఎందుకమ్మా నీకు శ్రమ?'' అంది సుమతి మొహమాటంగా.

''కాఫీ కలిపితే శ్రమా?'' అని నవ్వి ''ఇప్పుడు చెప్పు ఎన్ని రోజుల్నుంచి జ్వరం?'' అనడిగింది.

''రెండు రోజుల్నుంచి''

''అయినా మాత్రలు వేసుకోవటంలేదు. ఎందుకని?''

''అదే తగ్గిపోతుందనుకున్నాను''

''అంతేనా అన్నయ్య పట్టించుకోవటం లేదని నిన్ను నువ్వు శిక్షించుకుంటున్నావా'' నిలదీసింది.

**''ఔనమ్మా. జీవితమంతా ఆఫీస్ రొటీన్‌తోనే గడిచిపోయింది. నాకూ ఛేంజ్ కావాలనిపిస్తోంది. అసలు ఆఫీస్ లోకంలాగా, బావిలో కప్పలాగా ఎట్లా ఉన్నానో అని ఆశ్చర్యంగా ఉంది. నిన్నటికి నేటికి నాలో వచ్చిన మార్పు నాకే గమ్మత్తుగా ఉంది'' చెప్పుకుపోతున్నాడు సదానందం.**

''నీకన్నీ తెలుసు. నేనింక చెప్పేదేముంది?''

''ఇన్నేళ్ళు కాపురం చేసి, అన్నయ్య స్వభావం తెలిసినదానివి, ఎందుకొదినా బాధపడతావు?'' అంది అనునయంగా.

''ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఆయన పట్టించుకోకపోయినా నేను బాధపడను. కానీ అనారోగ్యంగా ఉన్నప్పుడు ఎందుకో మనసు బలహీనమౌతుంది. తట్టుకోలేను. రెండురోజుల్నుంచి జ్వరమని ఆయనకి తెలుసు. పిల్లల్ని ఎవరినైనా తీసుకుని డాక్టర్ దగ్గరకి వెళ్ళమంటారు. వాళ్ళని అడగలేను. అయినా వాళ్ళపనులు వాళ్ళకుంటాయి కదా! ఆఫీసంతా తనే అయినట్టు, దానికే జీవితం అంకితం చేసినట్టు ఉంటారు. డాక్టర్ దగ్గరికి వెళ్ళావా అని మళ్ళీ అడగలేదు'' అంది సుమతి బాధగా.

''ఒంట్లో బాగాలేకపోతే నువ్వేమయినా ముక్కుతూ మూలుగుతూ పడుకుంటావా? పడుకోవు. ఏ పనులూ మానుకోవు. ఇంక అన్నయ్యకి నీ అనారోగ్యం సంగతి ఎలా తెలుస్తుందమ్మా అంత హుషారుగా ఉంటే'' అంటూ వదినని నవ్వించాలని చూసింది ఇందిర.

''పోల్చుకుంటున్నానని నువ్వు అనుకోకపోతే ఓ మాట అడగనా'' అంది సుమతి.

''అడుగు'' అంది ఇందిర.

''మీకెవరికైనా దగ్గో, జలుబో వచ్చిందనుకో. అది తగ్గిపోయినా 'ఎట్లా ఉంది?' అంటూ ఎన్నిసార్లు అడుగుతారు చెప్పు'' అంటుంటే సుమతి గొంతు వణికింది. జవాబు చెప్పలేనట్టు నిస్సహాయంగా చూసింది ఇందిర.

''అందుకే ఏ అనారోగ్యం లేని పిడిరాయిలాంటి ఆరోగ్యమే నా అదృష్టం'' అని ''అయినా ఇది ఎప్పుడూ ఉండేదేగా వదిలేయ్ మీ సంగతులు చెప్పు'' అంది సుమతి.

''ఏమున్నాయిలే అంతా మామూలే'' అంది నిరాసక్తంగా.

''ఈరోజుకి ప్రత్యేకత ఉంది తెలుసా'' అనడిగింది సుమతి ఊరిస్తున్నట్టు.

సుమతి ఉత్సాహం చూశాక ఇందిరకి కూడా హుషారొచ్చింది. అదే సుమతిలో ప్రత్యేకత. ఎలాంటి బాధనైనా పక్కకి నెట్టేసి నవ్వుతూ ఉండగలగటం.

''ఏంటో విశేషం. తొందరగా చెప్పు ఊరించకుండా''

''ఇంక రేపట్నుంచి మీ అన్నయ్య ఫ్రీ'' అంది.

''అంటే రిటైరౌతున్నాడా''

''ఔను ఈరోజే లాస్ట్ వర్కింగ్ డే. రేపట్నుంచి నాకు సవతి పోరుండదు'' అంది సుమతి హాయిగా నవ్వుతూ. సుమతి భర్త సదానందం నిద్రలో కూడా

ఆఫీసు గురించి ఆలోచిస్తాడని కొందరు బంధువులు ఆఫీస్ అతని మొదటి భార్యంటూ జోక్ చేస్తుంటారు.

''ఇంక రేపట్నుంచి ఎంత హాయిగా ఉంటామో? ఇంటి విషయాల్లో నాకు బాధ్యత తీరిపోతుంది. ఏదో వండి పెట్టటం తప్ప ఇంకే వ్యవహారాలు చూడాల్సిన పనిలేదు. ఇంటికి కావలసినవన్నీ ఆయనే తెచ్చిపడేస్తారు. నేను గడప దాటి వెళ్ళే పనిలేదు. రోజు మొత్తం ఇద్దరం కలిసే ఉండొచ్చు. కబుర్లు చెప్పుకోవచ్చు. కలిసి తిరిగొచ్చు. మా చెల్లాయి, తమ్ముడు వాళ్ళింటికి వచ్చి రెండురోజులు ఉండమని ఎప్పట్నుంచో అంటున్నారు. ఇంకా మేము వెళ్ళవలసిన ఫంక్షన్స్ కూడా చాలా ఉన్నాయి'' చెప్పుకుపోతోంది సుమతి ఉత్సాహంగా.



''మా ఇంటికి వచ్చి నెలరోజులుండాలి'' అంది ఇందిర.

''అలాగే. ముందు మీ ఇంటికే వస్తాం'' అని ''అయ్యో నాకు మతిపోతోంది. నిన్నిట్లా కూర్చోపెట్టేసి మాట్లాడేస్తున్నాను. ఏమైనా తిందువుగాని పద'' అంటూ వంటింటి వైపు దారితీసింది సుమతి.

''ఇప్పుడేమీ వద్దులే వదినా. భోజనం చేసే బయల్దేరాను. కాసేపు రెస్ట్ తీసుకో'' అంది ఇందిర.

''అయితే కొద్దిగా టిఫెన్ చేద్దువులే. మీ అన్నయ్య రిటైర్మెంట్ తల్చుకోంగానే నాకు బలం వచ్చేసింది'' అని ''అయినా మీ అన్నయ్య మాత్రం ఏంచేస్తారులే. ఆయనకి పైవాళ్ళతో మాటపడటం ఇష్టముండదు. కిందవాళ్ళు పనిచేయరు. ఆ పని కూడా తనే చేస్తారు. మాట అనే అవకాశం ఇవ్వరు. ఏంచేస్తాం కొందరి స్వభావం అలా ఉంటుంది'' అంది.

''మా పిన్ని కూతురు పెళ్ళి పైనెలలోనే. వాళ్ళబ్బాయి పెళ్ళికి వెళ్ళటానికి మాకు కుదరలేదు. ఇదే వాళ్ళింట్లో ఆఖరి పెళ్ళి. తప్పకుండా వెళ్ళాలి. ఆయనకి తీరికేగా'' సుమతి చిన్నపిల్లలాగా ఉత్సాహంగా చెప్తుంటే ఇందిరకి ముచ్చటేసింది.

సుమతికి సదానందంతో పెళ్ళయ్యేసరికి ఇందిరకి ఐదేళ్ళు. సుమతికి, ఇందిరకి 15 సంవత్సరాలు తేడా ఉంది. సుమతి ఇందిరని కూతుర్లాగే చూసుకునేది. ఇందిరకే కాదు, మరిదికి కూడా కావలసినవి అన్నీ సుమతి ద్వారానే సమకూరేవి. సుమతి మనసును పూర్తిగా అర్ధం చేసుకున్నది ఇందిర ఒక్కతే. సదానందానికి సుమతి ఇష్టాయిష్టాలు అభిరుచులు తెలియవంటే అతిశయోక్తిలేదు. వాళ్ళకి ఇద్దరు కొడుకులు. కోడళ్ళిద్దరూ కూడా ఉద్యోగాలకి వెళ్తారు. అందరికీ అన్నీ అమరుస్తూ మనవల్ని చూసుకుంటూ తృప్తిపడుతూ ఉంటుంది సుమతి.

సదానందం సర్వీసులో ఆఫీస్ అవర్స్ కాగానే ఇల్లు చేరిన సందర్భాలు చాలా తక్కువ. ఆఫీసే సర్వస్వంలాగా ఉంటాడు. రాత్రి ఏడున్నరకి ముందు ఇంటికి ఎప్పుడూ రాడు. శలవలు పెట్టటం కూడా తక్కువే.

బి.వి.శేషమాంబ

ఆఖరుకి ఎల్‌టిసి కూడా వాడుకోడు. కొంతకాలం తల్లిదండ్రుల ఆరోగ్యాలు బాగోలేక, ఆ తర్వాత చెల్లి, తమ్ముళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు పేరంటాలు, తన పిల్లల చదువులు ఎప్పుడూ ఏవో ఒక బాధ్యతలతో తలమునకలుగా ఉండేవాడు. వెనక ఆస్తిపాస్తులు లేకపోవటం వల్ల అన్నీ జీతం డబ్బులతోనే జరగాలి.

సుమతి తరపున ఏవైనా శుభకార్యాలు జరిగినా ఒక్కతే వెళ్ళేదికాదు. సదానందానికి కుదరకపోతే తనూ మానుకునేది. అందుకే భర్త రిటైరౌతున్నాడంటే ఎంతో సంబరపడుతోంది. పైగా ఆర్ధిక ఇబ్బందులన్నీ అధిగమించేశారు. ప్రస్తుతం ఏ లోటూలేదు.

★★★

ఆఫీస్ నుంచి వచ్చిన సదానందానికి ఎదురు వెళ్ళింది ఇందిర.

''నువ్వెప్పుడు వచ్చావమ్మా! అంతా కులాసానా''

అంటూ ఆప్యాయంగా పలకరించాడు సదానందం.

''బాబుని గుంటూరు కాలేజ్‌లో దించి వస్తున్నాను. ఆయన ఆఫీసు పనిమీద హైదరాబాదు వెళ్లారు. రెండురోజులదాకా రారు. వచ్చేటప్పుడు తనని కూడా రమ్మని, నేనిటు వచ్చాను'' అంది ఇందిర.

''మంచిపని చేశావు. మిమ్మల్ని చూసి చాలా రోజులైంది'' అన్నాడు సదానందం పడక్కుర్చీలో వాలుతూ.

తన చేతిలో ఉన్న టీ కప్పు అన్నయకి అందించబోయింది ఇందిర.

''నువ్వు తాగు ఇందిరా, మీ అన్నయ్యకి షుగర్ లేని టీ కావాలి'' అంటూ టీ కప్పు మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది సుమతి.

''పిల్లలేరి?'' అడిగాడు సదానందం చుట్టూ చూస్తూ.

''మీ కొడుకులు, కోడళ్లు ఇంకా ఇల్లు చేరలేదు. వాళ్ళపిల్లలు ఆటలనీ, ట్యూషన్లనీ బైటికెళ్ళిపోయారు'' అంది ఇందిర.

''వీళ్ళింకా ఆఫీసుల్నించి రాలేదా?'' అన్నాడు సదానందం ఆశ్చర్యంగా.

''వాళ్ళసంగతి సరేకానీ నువ్వింత త్వరగా రావటమే నాకు ఆశ్చర్యంగా ఉంది'' అంది ఇందిర నవ్వుతూ.

''ఈరోజుతో నేను రిటైరయ్యానమ్మా. ఓ చిన్న ఫేర్‌వెల్ పార్టీ కూడా జరిగింది. లేకుంటే ఇంకో గంట ముందే వచ్చేవాణ్ణి'' అన్నాడు సదానందం.

''అన్నయ్యా. మరి ఇప్పుడు నీకేం తోచదు కదా! మరి కాలక్షేపం ఎట్లా?'' అడిగింది ఇందిర.

''ఏముంది? దేశాటనే'' అన్నాడు సదానందం నవ్వుతూ.

''నాక్కూడా ఇంతవరకూ ఏమీ చూపించలేదు. ఇప్పుడైనా కొన్ని పుణ్యక్షేత్రాలు తిరిగిరావాలి'' అంది సుమతి.

''నువ్వెక్కడికి తోకలాగా. రామేశ్వరం వెళ్ళినా..అన్నట్టు'' అని నవ్వాడు సదానందం. వెంటనే చిన్నబుచ్చుకుంది సుమతి.

★★★

మర్నాడు మధ్యాహ్నం బైటనుంచి వచ్చిన సదానందం హుషారుగా కనిపించాడు ఇందిరకి.

''ఏంటన్నయ్యా విశేషం'' అడిగింది ఇందిర.

ఇంకో పదిరోజుల్లో ఇక్కడినుంచి యాత్రాస్పెషల్ ఒకటి బైల్దేరుతుంది. అందులో టికెట్ బుక్ చేసుకున్నాను. సౌత్ ఇండియా మొత్తం చూపిస్తారు. నెలరోజుల ప్రోగ్రాం'' అన్నాడు సదానందం.

''నువ్వొక్కడివేనా అన్నయ్యా'' ఆశ్చర్యంగా అడిగింది ఇందిర.

''ఔనమ్మా. జీవితమంతా ఆఫీస్ రొటీన్‌తోనే గడిచిపోయింది. నాకూ ఛేంజ్ కావాలనిపిస్తోంది. అసలు ఆఫీస్ లేకంలాగా, బావిలో కప్పలాగా ఎట్లా ఉన్నానో అని ఆశ్చర్యంగా ఉంది. నిన్నటికి నేటికి నాలో వచ్చిన మార్పు నాకే గమ్మత్తుగా ఉంది'' చెప్పుకుపోతున్నాడు సదానందం.

వంటగదిలో ఉన్న సుమతి కళ్ళు తుడుచుకోవటం స్పష్టంగా కనిపించింది ఇందిరకి.

''శలవురోజు కూడా ఆఫీసుతోనే గడిచిపోయేది ఒక సరదా లేకుండా. అప్పట్లో అది బాగుండేది కూడా. ఇంక ఇప్పుడు కాలక్షేపం కష్టం. ఇప్పుడైనా ఓపిక వున్నప్పుడే నాలుగు చోట్లు తిరిగి రావాలనిపిస్తోంది'' అన్నాడు సదానందం.

''అన్నయ్యా, నువ్వేమీ అనుకోనంటే..'' మధ్యలోనే ఆగింది ఇందిర.

''ఛ ఛ అనుకోవటం ఏంటి? నువ్వట్లా ఎందుకు అనుకుంటావు? నువ్వు చెప్పదల్చుకున్నది వెంటనే చెప్పేయ్'' అన్నాడు సదానందం నవ్వుతూ.

మళ్ళీ తనే ''నువ్వు కూడా వస్తావా నాతో?'' అడిగాడు అభిమానంగా.

''వదినని కూడా తీసుకువెళ్ళాలనే ఆలోచన నీకు రాలేదా?'' అడిగింది సూటిగా.

''వదినెందుకు? ఆవిడ కూడా వస్తే ఇక్కడ అందరికీ ఇబ్బంది కాదూ'' అన్నాడు తేలిగ్గా.

''మరి రిటైర్మెంట్ నీకేనా. వదినకి లేదా'' అడిగింది నవ్వుతూనే.

''ఆవిడకి ఓపిక పోయినప్పుడే రిటైర్మెంటో'' తనూ నవ్వుతూ అన్నాడు సదానందం.

''అన్నయ్యా!'' అంది ఇందిర బాధగా. తమ సంభాషణంతా సుమతి వింటూ బాధపడుతూ ఉంటుందని ఆమెకి తెలుసు.

''వదిన నిన్ను వదిలిపెట్టి ఒక్కతే ఇంతవరకూ ఎప్పుడైనా వెళ్ళిందా?''

''వెళ్ళలేదు.''

''ఎంత ముఖ్యమైన శుభకార్యమైనా నీతోపాటే వెళ్ళేది. నీకు కుదరకపోతే తనూ మానుకునేది. నిన్నే నీడలాగా అంటిపెట్టుకుని ఉంటుంది కదా. ఇప్పుడు నువ్వు తనని వదిలేసి ఒక్కడివే వెళ్ళాలనుకోవటం ఏం బాగుంది చెప్పు''

సదానందం మాట్లాడలేదు.

''నీకంటే వయసులో చిన్నదాన్నయినా ఇట్లా చెప్పక తప్పటం లేదు. వదినకి కూడా ఇంతకాలం రొటీన్‌గానే గడిచింది కదా. ఇంతమందికి వండివార్చటం, మనవల ఆలనా పాలనా చూడటం, నీ ఆరోగ్యం దృష్ట్యా నీకు వేరుగా వంట చేయటానికి కూడా ఏ రోజూ విసుక్కోదు. ఎవరికీ ఏ లోటూ లేకుండా చూసుకుంటూ వస్తోంది. ఎప్పటికప్పుడు బాధ్యతలు పెరుగుతున్నాయి కానీ తరగటం లేదు కదా''

''మరిప్పుడు వదిన కూడా వస్తే ఇక్కడ వీళ్ళకి ఇబ్బంది కాదా! ముఖ్యంగా పసివాళ్ళకి''

''కొంతకాలం ఇబ్బంది పడితే పడ్డారు. వాళ్ళపిల్లల కోసమే కదా! వాళ్ళు ఇబ్బందిపడినా ఎట్లాగో సర్దుకుంటారు. అయినా అవి వదినకి తప్పనిసరి బాధ్యతలు కావు. ఇంట్లో ఉన్నదికాబట్టి చూస్తోంది అంతే. నువ్వు వేరే వూళ్ళో ఉద్యోగం చేస్తుంటే నిన్ను వదిలి ఇక్కడ ఉండేదా? నువ్వెక్కడ ఉంటే అక్కడే కదా తనుండేది''

''నువ్వు చెప్పింది కరెక్టే అనిపిస్తోంది కానీ..''

''ఇంకేం అనుమానాలు పెట్టుకోవద్దు. వెంటనే వెళ్ళి ఇంకో టిక్కెట్ బుక్ చెయ్యి. ఇంకా పదిరోజులు టైముందికాబట్టి పిల్లలు వాళ్ళ ఏర్పాట్లు వాళ్ళు చేసుకుంటారు. ఇద్దరూ హాయిగా ఓ నెలరోజులపాటు తిరిగిరండి. ఇంతకాలం ఎవరి రొటీన్‌లో వాళ్ళున్నారు. ఇప్పుడైనా కలిసి హాయిగా ఉండండి. వచ్చేటప్పుడు మా ఇంటికి వచ్చి ఓ పదిరోజులు ఉండాలి. మీరు సుఖపడేది ఈ కొన్నిరోజులే. ఓపిక పోయిన రోజున తల్చుకోవటానికి మిగిలేది ఈ జ్ఞాపకాలే. తిరిగి వచ్చాక ఇంట్లో మనవలతో కలిసి కులాసాగా గడపవచ్చు'' ఆగింది ఇందిర.

''నేనింత ఆలోచించలేదమ్మా'' అన్నాడు సదానందం.

''ఇంతవరకూ ఆలోచించకపోయినా వదిన ఏమీ ఫీల్ కాలేదు. ఇకముందు మాత్రం తనని బాధపెట్టకన్నయ్యా'' అంది ఇందిర.

''సరే. సాయంత్రం వెళ్ళి ఇంకో టిక్కెట్ బుక్ చేస్తాను'' అన్నాడు సదానందం.

అన్నీ వింటున్న సుమతి తను కూతురులాగా చూసుకున్న ఇందిర నిజంగా కన్నకూతురులాగా ఆలోచించగలిగినందుకు, మనసులోనే ఆమెని ఆశీర్వదించింది సజల నేత్రాలతో.

☆

